సాక్షి సిద్దిపేట

బుధవారం । 13 । డిసెంబర్ । 2023



అందరికీ విద్యే లక్ష్యంగా..

విద్యాహక్కు చట్టం ప్రకారం బడీడు పిల్లలందరూ కచ్చితంగా పాఠశాలలో చదువుకోవాలి. కానీ వివిధ కారణాల వల్ల అనేక మంది పిల్లలు చదువుకు దూరం అవుతున్నారు. వివరాలు 8లో ►



'అమ్మవారి'కే శఠగోపం

'దేవుడి పైన దళారుల పాలు' అన్నట్లు ఏడుపాయల దుర్గమ్మ ఆదాయాన్ని కొంత మంది టెండర్ దారులు అందిన కాడికి దోచుకుంటున్నారు. వివరాలు 8లో ►



ప్రొటోకాల్ పాటించాలి

మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా పర్యటనలో అధికారులు ప్రొటోకాల్ పాటించడంలేదని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. వివరాలు 9లో ►

న్యూస్‌రీల్

దరఖాస్తు చేసుకోండి

మద్దూరు(హుస్నాబాద్): నూతనంగా వ్యవసాయ పట్టాపాస్ బుక్‌లు పొందిన రైతులు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని మద్దూరు ఏఈఓ రాకేశ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతనంగా వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ చేసుకొని పట్టాదారు పాసుబుక్ పొందిన రైతులు స్థానిక రైతు వేదికలలో వ్యవసాయ విస్తరణ అధికారి వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతుబంధు దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్, బ్యాంక్ అకౌంట్, దరఖాస్తు ఫారం నింపి ఏఈఓలకు అందించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం రైతుల ఖాతాలో జమ అవుతుందన్నారు.

కేతకీలో ఘనంగా అమావాస్య పూజలు



ఆలయ గర్భగుడిలో విశేష అలంకరణలో అమ్మవారు

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ప్రసిద్ధ శైవ క్షేత్రమైన ఝరాసంగం కేతకీ సంగమేశ్వర ఆలయం భక్తులతో పోటెత్తింది. మంగళవారం అమావాస్యను పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఆవరణలోని అమృత గుండంలో పుణ్య స్నానాలు ఆచరించి జల లింగానికి పూజలు చేశారు. అనంతరం గర్భగుడిలోని పార్వతీపరమేశ్వరులను దర్శించుకుని స్వామివారికి అభిషేకం, అర్చన, మహామంగళహారతి, వాహన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈఓ శశిధర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆలుసాగుపై అవగాహన




ఆలు పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త స్నేహలత

జహీరాబాద్ టౌన్ : రంజోల్ రైతువేదికలో మంగళవారం కేవీకే–డీడీఎస్ సంస్థ శాస్త్రవేత్తలు ఆలు సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆలుకు సోకే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు సస్యరక్షణ చర్యల గురించి శాస్త్రవేత్త స్నేహలత వివరించారు. అనంతరం రైతులతో కలిసి ఆలు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మహీంద్ర అండ్ మహీంద్ర కర్మాగారం సహకారంతో బైఫ్ స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న వాటర్‌షెడ్ కార్యక్రమాల గురించి ప్రాజెక్టు మేనేజర్ అరుణ్ కుమార్ వివరించారు. వాటర్‌షెడ్‌లో భాగంగా చేపట్టే పర్కులేషన్ ట్యాంక్, చెక్ డ్యాంలు, బోర్వెల్ రీచార్జి, ఫాం పాండ్స్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రదీప్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో రూ.32కోట్లు జమ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సాగు పెట్టుబడి సాయం కోసం అందించే రైతుబంధు డబ్బులు మంగళవారం రూ.32కోట్లు జమ అయ్యాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో 5.6లక్షల ఎకరాల్లో సాగు భూమి, 3.45లక్షల రైతులు ఉన్నారు. అందుకు గాను రూ.322.93కోట్లు రైతుల ఖాతాల్లో వేయనున్నారు. మొదటి రోజు ఎకరా లోపు విస్తీర్ణం ఉన్న 1.24లక్షల మంది రైతులకు రూ.32కోట్లు జమ అయ్యాయని తెలిపారు. మిగతా రైతులకు త్వరలోనే జమ కానున్నాయన్నారు.





దుబ్బాక పెద్ద చెరువులో దీపాలను వదులుతున్న మహిళలు

వైభవం.. కార్తీక దీపోత్సవం

దుబ్బాక పట్టణంలో కార్తీక దీపోత్సవం మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు వేలేటి జయరామశర్మ ఆధ్వర్యంలో పట్టణంలోని పెద్ద చెరువులో దీపోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని చెరువులో దీపాలను వదిలారు.

– దుబ్బాకటౌన్

సుడాకు కొత్త సారథి!

నాన్ స్టాప్‌కు ఇక ఫుల్‌స్టాప్
- సుడా ఏర్పడినప్పటి నుంచి ఒక్కరే చైర్మన్
- ప్రభుత్వం నిర్ణయంతో కొత్త వారికి అవకాశం
- బీఆర్‌ఎస్ నేతల ఎఫ్‌డీసీ, ఎండీసీ, ఆర్టీసీ చైర్మన్ పదవుల రద్దు
- మార్పులు, చేర్పులపై జిల్లా అంతటా చర్చ



సిద్దిపేట పట్టణంలోని సుడా కార్యాలయం

సాక్షి, సిద్దిపేట: 'సుడా'కు కొత్త సారథిరానున్నారు. జిల్లాకు చెందిన కొందరి నాన్‌స్టాప్ నామినేట్ పదవులకు ఫుల్‌స్టాప్ పడింది. వివిధ కార్పొరేషన్ చైర్మన్ పదవులను రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వం హయాంలో నియమితులైన వారిలో కొందరికీ పదవులను మారుస్తూ వచ్చారు. మరి కొందరికి అవే పదవులు కొనసాగాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో పదవులు రద్దు కావడంతో పాటు కొత్త వారికి అవకాశం దక్కనుంది. దీంతో ఆయా కార్పొరేషన్లలో పలు మార్పులు సైతం రానున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.

సుడా ఏర్పడినప్పటి నుంచి..

సిద్దిపేట జిల్లాగా ఏర్పాటు కావడంతో పట్టణంతో పాటు, గ్రామాలను కలుపుతూ సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) డిసెంబర్ 2017లో ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 18, 2018న బీఆర్‌ఎస్ నేత రవీందర్ రెడ్డిని సుడా చైర్మన్‌గా, పాలకవర్గంను నియమించారు. నియామకం సందర్భంగా విడుదల చేసిన ప్రభుత్వ జీఓ లో చైర్మన్ కాల పరిమితిని పొందుపరచలేదు. డైరెక్టర్లు మారినా సుడా చైర్మన్‌గా రవీందర్ రెడ్డి కొనసాగారు. సుమారు ఐదేళ్లు ఒక్కరే చైర్మన్‌గా వ్యవహరించారు. పట్టణం సుందరీకరణలో, అభివృద్ధిలో ప్రముఖ పాత్ర సుడా పోషిస్తోంది.

మాజీలైన పలువురు నేతలు

కాంగ్రెస్ ప్రభుత్వం పలు కార్పొరేషన్ చైర్మన్ల పదవులను రద్దు చేయడంతో జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ నేతలు ఆయా పదవులకు మాజీలు అయ్యారు. రాష్ట్ర వైద్యమౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్ఎంఐడీసీ) చెర్మన్‌గా డిసెంబర్ 15, 2021న సిద్దిపేటకు చెందిన డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ నెల 14తో రెండేళ్లు ముగుస్తున్నప్పటికీ ముందే రద్దు చేశారు. గజ్వేల్‌కు చెందిన వంటేరు ప్రతాప్‌రెడ్డి అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా డిసెంబర్ 16, 2021న, అంతకంటే ముందు కూడా ఇదే పదవీలో కొనసాగారు. రెండేళ్ల పదవీ కాలం ఈ నెల 15తో ముగుస్తుండగా ముందుగానే ప్రభుత్వం రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అక్టోబర్ 5, 2023న ఆర్టీసీ చైర్మన్‌గా నియమితులయ్యారు. ముత్తిరెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన వారం రోజుల తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. దీంతో ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడంతో పదవిని కోల్పోయారు. జిల్లాకు చెందిన నామినేట్ పోస్టులలకు పలువురు స్వచ్ఛందంగా రాజీనామ చేశారు. రైతు సమన్వయ సమితి అధ్యక్షుడుగా ఉన్న వంగ నాగిరెడ్డితో పాటు పలువురు తమ పదవులకు రాజీనామా చేశారు.

ప్రజలతో మమేకమై పని చేయండి

మంత్రి పొన్నం ప్రభాకర్
- అధికారులకు దిశానిర్దేశం
- కలెక్టరేట్‌లో మొదటిసారిగా శాఖల వారీగా సమీక్ష



మంత్రి పొన్నంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, సీపీ శ్వేత

సిద్దిపేటరూరల్: ప్రజలతో మమేకమై జిల్లా అభివృద్ధికి పని చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో మొదటి సారిగా కలెక్టర్, అదనపు కలెక్టర్లతో శాఖల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులు వారి శాఖలకు సంబంధించిన వివరాలను మంత్రికి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ ప్రభుత్వ పరిపాలన ఆలోచన విధానం మారిందని, అధికారులు వారి విధానాలను మార్చుకోవాలని అన్నారు. గతంలో అధికారం కేంద్రీకృతంగా ఉందని, నేడు వికేంద్రీకరణ జరగాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజా సంబంధిత సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంతకుముందు కలెక్టరేట్‌కు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, సీపీ శ్వేతలు పుష్పగుచ్ఛం అందించి స్వాగతించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, సీపీ శ్వేత, అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, శ్రీనివాస్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి సరోజా, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన హన్మకొండ కలెక్టర్

హుస్నాబాద్ పట్టణంలో మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హన్మకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి నివాసంలో ఆయనకు కలెక్టర్ పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు

సిద్దిపేటజోన్: బీఆర్ఎస్, బీజేపీలు రెండు ఒక్కటే, వాళ్లిద్దరూ కుమ్మక్కయ్యారని మంత్రి పొన్నం విమర్శించారు. మంగళవారం రాత్రి సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఇక్బాల్ మినార్(ఈద్గా)మదిన హోటల్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి తేనీరు సేవించారు. ఈ సందర్భంగా పది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌తో టచ్‌లో ఉన్నారని బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. రాజకీయ అవగాహన లేని వారు మాట్లాడే మాటలని కొట్టిపారేశారు.

హుస్నాబాద్‌కు మెడికల్ కళాశాల

- వచ్చే కేబినెట్‌లో స్థలం కోసం సిఫారసు
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలో మెడికల్ కళాశాల ఏర్పాటు అవుతోందని, ఇందు కోసం 50 ఎకరాల స్థలాన్ని సేకరించాలని తహసీల్దార్‌ను ఆదేశించినట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం హుస్నాబాద్ మున్సిపాలిటీని మంత్రి సందర్శించారు. మంత్రిగా మొదటి సారి రావడంతో పాలకవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం పాలకవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వచ్చే కేబినెట్ సమావేశంలో మెడికల్ కళాశాల స్థలం కేటాయింపుపై ప్రతిపాదనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు కేంద్రీయ పాస్‌పోర్ట్ కార్యాలయాన్ని కరీంనగర్‌లో ఏర్పాటు చేశానన్నారు. అలాగే కరీంనగర్, సిరిసిల్ల ప్రాంతాల్లో కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేశానని, హుస్నాబాద్‌లో కూడా కేంద్రీయ విద్యాలయం కోసం ప్రయత్నిస్తానని, కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్‌ను ఆదేశించామన్నారు.

కోమటి చెరువుకు దీటుగా..

సిద్దిపేటలోని కోమటి చెరువు హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువులో పది శాతం కూడా లేదని, కోమటి చెరువును అభివృద్ధి చేశారే తప్ప ఎల్లమ్మ చెరువును విస్మరించారన్నారు. ఎల్లమ్మ చెరువును గొప్పగా సుందరీకరిస్తామన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల స్థానంలో ప్రతి పేదవాడికి ఇల్లు కట్టుకునేందుకు ఇందిరమ్మ పథకం కింద రూ.5లక్షలు ఇస్తామన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ఇదివరకే పూర్తి చేశారని, ఆ అంశం జోలికి వెళ్లనని తెలిపారు. డబుల్ బెడ్రూం ఇళ్లల్లో ఉన్న గౌరవెల్లి ముంపు బాధితులను ఖాళీ చేయాలని బలవంతం చేయబోమని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారికి సహకారం అందిస్తామన్నారు.



పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మంత్రి పొన్నంకు వినతి పత్రం ఇస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, పాలకవర్గ సభ్యులు

ప్రతీ ఇంటికి భగీరథ నీళ్లు



స్టాండింగ్ కమిటీ సమావేశంలో రోజాశర్మ, అధికారులు

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేటజోన్: జిల్లాలోని ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ నీళ్లు చేరేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ రోజాశర్మ సూచించారు. మంగళవారం జెడ్పీ కార్యాలయంలో రెండో రోజు స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో భాగంగా మహిళా, శిశు సంక్షేమ, సాంఘీక సంక్షేమ, ఆర్థిక పనులు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో నీటికొరత లేకుండా చూడాలని, ఏమైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించాలని సూచించారు. కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లో మినీ అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, మినీ అంగన్వాడీ కేంద్రాల విషయంలో కారణాలు గుర్తించడానికి విచారణ జరిపించాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ఉన్న మహిళా ప్రాంగణాల్లో మహిళలకు వివిధ రంగాల్లో ఉచితంగా శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బీసీ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు చలి ప్రభావం ఉండకుండా స్వెటర్స్ ఇవ్వాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని దీని వల్ల విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ రమేశ్, జెడ్పీటీసీలు జ్యోతి, కవిత, మంగ, రవీందర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రఘురాం

మానవ హక్కులను గౌరవించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రఘురాం

సిద్దిపేటకమాన్: మానవ హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం అన్నారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా సిద్దిపేట కోర్టులో మంగళవారం పోలీసు అధికారులు, న్యాయవాదులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశానుసారం ఈ నెల 30న సిద్దిపేట కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో న్యాయమూర్తులు మురళీ మోహన్, స్వాతిరెడ్డి, చందన, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్రూంలు

ఆశలు డబుల్.. పంపిణీపైనే గుబులు

కొలిక్కి వచ్చేదెన్నడో?
- గృహ ప్రవేశాల కోసం ఎదురుచూపులు
- గత మార్చిలోనే 1100మంది లబ్ధిదారుల ఎంపిక
- అధికారుల చర్యలపైనే అందరి దృష్టి

గజ్వేల్: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో 'డబుల్' ఇళ్ల గృహ ప్రవేశాల కోసం పేదలు ఎదురుచూస్తున్నారు. పలు కారణాలతో పెండింగ్‌లో ఉన్న ఈ వ్యవహారాన్ని అధికారులు ఏవిధంగా కొలిక్కి తెస్తారో అనే అంశం చర్చనీయాంశంగా మారింది. పలు దఫాలుగా చేపట్టిన క్షేత్రస్థాయి విచారణలో 1,550 మంది ఈ పథకానికి అర్హులుగా తేల్చారు. కానీ పంపిణీ చేసే ఇళ్లు 1100 మాత్రమే ఉన్నాయి. ఎంపికైన వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో గత మార్చి 21న లక్కీ డ్రాలో 1100 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి మొత్తం 1,250 ఇళ్లు మంజూరు చేశారు. ఈ 'మోడల్ కాలనీ'కి సంబంధించి 2015 మే 9న పాలిటెక్నిక్ వెనుకభాగంలోని ప్రభుత్వ స్థలంలో శంకుస్థాపన చేసి పనులు పూర్తి చేశారు. ఈ కాలనీలో ఒక్కో ఇల్లు 570 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మాణం జరిగింది. 156 బ్లాకులుగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఒక్కో బ్లాకులో కింద నాలుగు, పైన నాలుగు(మొత్తం 8 ఇళ్లు) రెండు ఫ్లోర్లుగా నిర్మాణం జరిగింది. కానీ పంపిణీ వ్యవహారం ఏళ్ల తరబడి నానుతూ వస్తున్నది. ఈ క్రమంలో లబ్ధిదారుల ఎంపికకు 2021 మే 13నుంచి 20వరకు దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు.. ఈ సందర్భంగా 4,106 దరఖాస్తులను ప్రజలు అందించగా.. ఇందులో 3,518 మంది దరఖాస్తులను పరిగణనలోకి తీసుకొని క్షేత్రస్థాయిలో విచారణ అనంతరం రెండేళ్ల తర్వాత 2023 ఫిబ్రవరి 3న 1,118మందితో ప్రాథమిక జాబితాను విడుదల చేసిన విషయం విదితమే. దీనిపై అభ్యంతరాలు వెల్లువెత్తాయి.

అర్హతలున్నా..

జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నాయని సుమారు 720కిపైగా ఫిర్యాదులు వచ్చాయి. తమకు అన్ని రకాల అర్హతలున్నాయని కూడా కొందరు దరఖాస్తు చేసుకోగా వీటన్నంటినీ పరిగణలోకి తీసుకొని మార్చి 3న మరోసారి 1389మందితో మరో జాబితా అధికారులు విడుదల చేశారు. దీనిపై కూడా దుమారం రేగింది. అన్ని రకాల అర్హతలున్నా తనకు ఇల్లు దక్కలేదని ఓ మహిళా ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మరోసారి క్షేత్రస్థాయి పరిశీలన జరిపి కొందరు లబ్ధిదారులకు అవకాశం కల్పించారు. ఈ క్రమంలోనే మార్చి 21న తుది డ్రా నిర్వహించి 1100మందిని ఎంపిక చేశారు. మోడల్ కాలనీలో 1,250 ఇళ్లు ఉన్నా..భూనిర్వాసితులు, ఆస్తులు కోల్పోయిన వారికి నిర్ణయించి, పట్టణ పేదలకు మాత్రం 1100 ఇవ్వాలనుకొని ఈ మేరకు అంతమందినే ఎంపిక చేశారు. 1100 మందికి గృహ ప్రవేశాలే కాదు.. ఇళ్ల స్థలాలు ఆశిస్తున్న వారి వ్యవహారంలో ఒక్క అడుగు ముందుకు పడలేదు. డ్రాలో పేర్లు గల్లంతయిన వారికి 60నుంచి 70 గజాల స్థలం, ప్రభుత్వం నుంచి రూ.3లక్షల సాయం అందించడానికి చర్యలు చేపడతామని కూడా నమ్మబలికారు. కానీ ఈ వ్యవహారానికి ఎన్నికల కోడ్ తర్వాత బ్రేక్ పడింది.

చిక్కుముళ్లు వీడేదెన్నడో?

గృహ ప్రవేశాలకు మరో అడ్డంకి కూడా ఉంది. ఈ ఇళ్లల్లో ప్రస్తుతం మల్లన్నసాగర్ నిర్వాసితులు నివాసముంటున్నారు. వారి సమస్యలు పరిష్కరించే వరకు ఇళ్ల నుంచి వారు వెళతారా? అధికారులు వారిని ఏవిధంగా ఒప్పించి ఖాళీ చేయిస్తారు? గత ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను ప్రస్తుత ప్రభుత్వం ఏవిధంగా పరిష్కరించనుంది? అనే అంశాలు ప్రశ్నార్థకంగా మారాయి. మరోవైపు తమకు వెంటనే గృహప్రవేశాలు చేయించాలని లాటరీ ద్వారా ఎంపికైనా లబ్ధిదారులు అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తాజాగా సోమవారం సిద్దిపేట కలెక్టరేట్‌కు వెళ్లి ప్రజావాణిలో తమ సమస్యను వివరించారు. ఈ అంశంలో అందరి దృష్టి అధికారుల చర్యలపైనే కేంద్రీకృతమై ఉన్నది. డబుల్ ఇళ్ల వ్యవహారంపై గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళిని వివరణ కోరగా.. ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న పేదల అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సమస్యలను పరిష్కరించి పంపిణీ జరిగేలా చూడాలని కోరతామన్నారు.

క్లుప్తంగా

ఉమ్మడి జిల్లా ఎస్జీఎఫ్ క్రికెట్ జట్టు ఎంపిక


ఎంపికైన క్రికెట్ జట్టు

సిద్దిపేటజోన్: ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్జీఎఫ్ అండర్ 19 క్రికెట్ జట్టును మంగళవారం సిద్దిపేట స్టేడియంలో ఎంపిక చేశారు. డిసెంబర్ 14 నుంచి 17 వరకు గద్వాల్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి బాలుర క్రికెట్ టోర్నీలో పాల్గొనున్నారు. ఈ ఎంపికలో సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడ శాఖ అధికారి నాగేందర్, జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాశ్, సిద్దిపేట క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున్, డాక్టర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంలో ఘర్షణ

పలువురికి తీవ్ర గాయాలు


ఆస్పత్రిలో క్షతగాత్రుడు

కోహీర్(జహీరాబాద్): మండలంలోని మనియార్‌పల్లి గ్రామంలో మంగళవారం భూ వివాదం కారణంగా జరిగిన ఘర్షణలో పలువురికి తీవ్రంగా గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని 41 సర్వే నంబర్ భూవివాదం గొడవకు దారితీసింది. ఇరువర్గాల వారు కత్తులు, పారలతో కొట్టుకోగా కోహీర్ మాజీ కో–ఆప్షన్ సభ్యుడు అశ్రఫ్ అలీ, ఆయన సోదరులు బర్కత్‌అలీ, రహమత్‌అలీ గాయపడ్డారు. వీరికి కోహీర్ ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించి డాక్టర్ సూచన మేరకు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. రహమత్‌అలీ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మరో వర్గానికి చెందిన మనియార్‌పల్లి వాసులు రషీద్, సత్తార్, కరీం, మహబూబ్‌బీ గాయపడ్డారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కోహీర్ పోలీసులు తెలిపారు.

తండ్రి మందలించాడని..

కుమారుడి ఆత్మహత్య


గణేశ్ మృతదేహం

చేగుంట(తూప్రాన్): తండ్రి మందలించాడని కుమారుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మాసాయిపేట మండల కేంద్రం శివారులో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్‌ఐ హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన గజ్జెల భూషణం కుమారుడు గణేశ్(26) కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగడం మానుకోవాలని శుక్రవారం తండ్రి భూషణం కుమారుడు గణేశ్‌ను మందలించాడు. దీంతో గణేశ్ అదే రోజు ఇంట్లోంచి వెళ్లిపోయాడు. ఈ క్రమంలోనే మంగళవారం సాయంత్రం మాసాయిపేట శివారులోని రామప్ప చెరువువద్ద గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు గుర్తించి పోలీసులు సమాచారం అందించారు. చేగుంట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహం ఎవరిది అనే దానిపై చుట్టుపక్కల గ్రామాల్లో విచారించగా ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన గణేశ్‌గా తెలిసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

‘అమ్మవారి’కే శఠగోపం

- ఏడుపాయల ఆలయ ఆదాయానికి గండి
- నిబంధనలు పాటించని టెండర్‌దారులు
- లక్షల్లో పేరుకుపోయిన బకాయిలు
- ప్రతీ ఏడాది కొత్తవారి పేరుతో టెండర్
- పట్టించుకోని అధికారులు


ఏడుపాయల పుణ్య క్షేత్రం

పాపన్నపేట(మెదక్): ‘దేవుడి పైన దళారుల పాలు’ అన్నట్లు ఏడుపాయల దుర్గమ్మ ఆదాయాన్ని కొంత మంది టెండర్ దారులు అందిన కాడికి దోచుకుంటున్నారు. టెండర్ దారులు రూ.కోటి బకాయిలు పెట్టి చివరి సమయానికి చేతులెత్తేస్తున్నారు. 2017 నుంచి ఆరేళ్లలో టెండర్ బకాయిలు రూ. 99,82,500 చేరాయి. కాగా అంతకు ముందు ఉన్న బకాయిల రికార్డులు లేవని అధికారులు చెబుతున్నారు. అవి కూడా భారీ మొత్తంలోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో ఇప్పటి వరకు ఇద్దరి మీద కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. అయినా ఫలితం లేదు. మళ్లీ కొత్త టెండర్లలో బకాయిదారులకు అవకాశమివ్వకపోవడంతో తమ స్నేహితుల పేరు మీద టెండర్లు వేస్తున్నారు. ఈ సమస్యను అధిగమించడానికి ఈసారి టెండర్ డబ్బులు మొత్తం మొదట్లోనే చెల్లించాలని నిబంధనలు పెట్టారు. దీంతో సోమవారం ఆరు టెండర్లు నిర్వహించగా అందులో ఐదు వాయిదా పడ్డాయి.

డబ్బు రావాల్సి ఉందంటూ..

గతంలో సైతం కొంత మంది బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది, కానీ దానికి సంబంధించిన రికార్డులు తమ దగ్గర అందుబాటులో లేవని అధికారులు చెబుతున్నారు. ఈ విషయంపై కొంతమంది టెండర్‌దారులు మాట్లాడుతూ.. తమకు ఆలయం నుంచి కొంత డబ్బు రావాల్సి ఉందని, అది చెల్లిస్తే బకాయిలు కట్టడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కాగా దేవస్థాన సిబ్బంది వీఐపీల కోసం దాదాపు 2,900 వందల చీరలు తమ దగ్గర తీసుకున్నట్లు టెండర్ దారు తెలిపారు.


టెండర్లు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

రూ.లక్షల్లో బకాయిలు

తెలంగాణలో ప్రసిద్ధి చెందిన ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయానికి ఏటా రూ.8 కోట్ల ఆదాయం వస్తుంది. ఇందులో గతేడాది టెండర్ల ద్వారా రూ.2,63,93,000 వచ్చింది. అయితే కొబ్బరికాయలు, ఒడి బియ్యం, తలనీలాలు, కొబ్బరి ముక్కలు, పూజా సామగ్రి, ఎగ్జిబిషన్‌లకు ప్రతీ సంవత్సరం టెండర్లు నిర్వహిస్తారు. కొంత మంది కోటరీగా ఏర్పడి ప్రతీయేటా రూ.కోట్ల మొత్తంలో టెండర్లు పాడి, చివరకు బకాయిలు కట్టే సమయంలో చేతులెత్తేస్తున్నారు. ఈ క్రమంలోనే 2017 నుంచి ఇప్పటి వరకు వసంత్‌రెడ్డి రూ.1,55,000, మల్లేశం పేరిట 2017లో రూ.17,25,500 లక్షలు బకాయి ఉన్నప్పటికీ, 2019లోనూ ఇతడికి టెండర్ ఇచ్చారు. మళ్లీ ఈ సంవత్సరం రూ.6,96,000 బకాయిలు పడ్డారు. వారిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. వీరితోపాటు ప్రసాద్ పేరిట 2017లో రూ.1,91,000 ఈఏడు 28,40,000 కలిపి మొత్తం రూ.30.31 లక్షలు బకాయిలు ఉన్నాయి. 2019లో శ్రీనివాస్ రూ.2 లక్షలు, ఎస్.సాయిలు రూ.2,50 లక్షలు, దశరత్ రూ.38 లక్షలు, రాంచందర్ రూ.5వేలు, ముజీబ్ రూ.50 వేలు బకాయిలు ఉన్నారు.

కేసులు నమోదు చేస్తాం

ఏడుపాయల ఆలయానికి టెండర్‌దారుల వద్ద నుంచి సుమారు.రూ.కోటి బకాయిలు రావాల్సి ఉంది. వీటి వసూళ్ల కోసం నోటీసులిస్తాం. ఆ పై కేసులు నమోదు చేస్తాం. బకాయిలు పడకుండా చూడాలన్న ఉద్దేశ్యంతో ఈసారి టెండర్ డబ్బులు మొత్తం వారం రోజుల్లో చెల్లించాలన్న నిబంధనలు పెట్టాం.

–మోహన్‌రెడ్డి, ఏడుపాయల ఈఓ


ప్రభుత్వాస్పత్రిలో సేవల గురించి అడిగి తెలుసుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రసవాల సంఖ్యను పెంచండి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- హుస్నాబాద్ ప్రభుత్వాస్పత్రి సందర్శన
- పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేత

హుస్నాబాద్: ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వైద్యులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి మొక్కలు నాటారు. ఆస్పత్రిలో వైద్య సేవలు ఎలా అందుతున్నాయో రోగులను అడిగి తెలుసుకున్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద రూ.10లక్షల ఖరీదైన వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతక ముందు ఆస్పత్రి ఆవరణలో వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి నెలా అమావాస్య రోజున రోగుల కుటుంబ సభ్యులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ..

హుస్నాబాద్ పట్టణంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పలు సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ కంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. హుస్నాబాద్ మండలంలో పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులను జోన్–1, జోన్– 2 కింది విభజిస్తే 300 మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్కిరెడ్డి మోహన్ రెడ్డి మంత్రికి వివరించారు. మున్సిపల్, గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేస్తూ కనీస వేతనంతోపాటు ప్రమాదబీమా, ఈపీఎఫ్, ఈఎస్ఐ, వారాంతపు సెలవులు తదితర సౌకర్యాలు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ మంత్రికి వినతిపత్రం ఇచ్చారు.

ప్రజలకు రెడ్ కార్పెట్‌తో స్వాగతం

అవినీతికి తావులేకుండా ఏ సమస్య వచ్చినా నేరుగా నన్ను కలిసేందుకు ప్రజలకు రెడ్ కార్పెట్‌తో నా కార్యాలయానికి స్వాగతం పలుకుతున్నానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలో మంగళవారం ఉదయం పలు వార్డుల్లో మార్నింగ్ వాక్ చేస్తూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. హుస్నాబాద్ పట్టణంలో నెలకొన్న సమస్యలు నా దృష్టికి వచ్చాయని తెలిపారు. సమస్యలపై జాబితాను తయారు చేసి అధికారులతో పరిష్కరిస్తానని అన్నారు. అవసరమైతే నిధులు సేకరిస్తామన్నా రు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, ఇతర కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అవినీతి సొమ్ముపై విచారణ చేపట్టాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్
- మెదక్‌లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

హవేళీఘణాపూర్(మెదక్): ఏఐసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాహుల్‌గాంధీకి అత్యంత సన్నిహితుడైన ధీరత్ సాహు వద్ద లభించిన అవినీతి సొమ్ము రూ.350 కోట్లపై విచారణ చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రమైన మెదక్‌లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడైన ధీరత్ సాహు ఎంపీగా ఓడిపోయినప్పటికీ రెండుసార్లు రాజ్యసభ నుంచి ప్రాతినిధ్యం అవకాశం కల్పించినటువంటి రాహుల్ గాంధీ సన్నిహితుడి వద్ద, డబ్బు, నగలు అవినీతి సొమ్ము కాదా.? అని వారు ప్రశ్నించారు. పెట్రోల్ ధర పెరిగింది అని చెప్పి సైకిల్ మీద వెళ్లినటువంటి ధీరజ్ సాహూ మరి ఇంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. దీనిపై రాహుల్‌గాంధీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నల్లాల విజయ్, రఘువీరా రెడ్డి, ఏక్కలదేవి మధుసూదన్, గోద రాజేందర్ యాదవ్, రమణ రావు, శ్రీనివాస్, తీగల శ్రీనివాస్, ప్రసాద్, ప్రభాకర్, శంకర్ గౌడ్,దయానంద్ రెడ్డి, సంతోష్ చారి, రంజిత్ రెడ్డి, రాజు, కల్కి నాగరాజు, రాహుల్, సన్నీ, బంటి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

పాపన్నపేట(మెదక్): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కొత్తపల్లిలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గౌరిగారి అనంతరాములు గౌడ్(62) పొలం పనులకు వెళ్లి సాయంత్రమైనా తిరిగి రాలేదు. కొడుకు సతీష్ గౌడ్ ఫోన్ చేసినా సమాధానం రాకపోవడంతో తిరుపతి అనే వ్యక్తిని అక్కడకు పంపాడు. పొలం వద్ద వెళ్లి చూసేసరికి ట్రాన్స్‌ఫార్మర్ పక్కన తీవ్ర గాయాలతో మృతి చెంది ఉన్నాడు. అతడికి భార్య యాదమ్మ, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం త్యార్ల రమేశ్, కాంగ్రెస్ నాయకులు సందీప్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పాపన్నపేట ఏఎస్‌ఐ గాలయ్య తెలిపారు.


అనంతరాములు (ఫైల్)

అందరికీ విద్యే లక్ష్యంగా..

- కొనసాగుతున్న బడి బయట పిల్లల గుర్తింపు సర్వే
- జనవరి 10 వరకు నిర్వహణ
- జిల్లాలో 68 క్లస్టర్‌ల ఎంపిక
- గతేడాది 212 మంది పిల్లలు గుర్తింపు
- పాల్గొననున్న సీఆర్‌పీలు, ఐఈఆర్‌పీలు


బడీడు పిల్లలను గుర్తిస్తున్న సీఆర్పీలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యాహక్కు చట్టం ప్రకారం బడీడు పిల్లలందరూ (14 ఏళ్లలోపు) కచ్చితంగా పాఠశాలలో చదువుకోవాలి. కానీ వివిధ కారణాల వల్ల అనేక మంది పిల్లలు చదువుకు దూరం అవుతున్నారు. ఇలాంటి వారిని గుర్తించడానికి ప్రభుత్వాలు బడీడు పిల్లల గుర్తింపు సర్వే కార్యక్రమం చేపట్టారు. ప్రస్తుతం సర్వే జిల్లాలో వేగంగా కొనసాగుతుండగా, జనవరి 10 వరకు చేపట్టనున్నారు. ప్రతీ హ్యాబిటేషన్‌లో బడి బయట ఉన్నటువంటి పిల్లల వివరాలను నమోదు చేసి, వారిని తిరిగి బడికి వచ్చేలా చేసే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని విద్యాశాఖ అధికారులు నిర్వహిస్తున్నారు.

సిద్దిపేట జిల్లాకు ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కుటుంబాలకు చెందిన చిన్నారుల వివరాలను నమోదు చేస్తున్నారు. జిల్లాలో ముఖ్యంగా భవన నిర్మాణాలు, ఫ్రౌల్ట్రీ రంగం, ఇటుకబట్టీలు, తదితర పనులకు ఒరిస్సా, బీహార్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, తదితర రాష్ట్రాల నుంచి వలస కార్మికులు వస్తుంటారు. దీంతో వీరికి చెందిన చిన్నారులు సమీపంలో పాఠశాలలు లేకపోవడంతో పాటుగా, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోవడంతో చదువుకు దూరం అవుతున్నారు. ఇలాంటి చిన్నారులను గుర్తించి పాఠశాలల్లో విద్యాబోధన అందించాలని ఈ బడీడు పిల్లల గుర్తింపు సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

300 మంది ఉన్నట్లు అంచనా..

2022–23 విద్యాసంవత్సరంలో జిల్లాలో 212 మంది విద్యార్థులను గుర్తించి సమీపంలోని పాఠశాలల్లో చేర్చారు. మిగిలిన విద్యార్థులను 21 వర్క్ సైట్ స్కూళ్లను ప్రారంభించి, విద్యాశాఖ అధికారులు విద్యను అందించారు. 2023–24 ఏడాదికి గాను జిల్లాలో 68 హ్యాబిటేషన్ క్లస్టర్‌లను విద్యాశాఖ గుర్తించింది. ఈ క్లస్టర్‌ల పరిధిలో 104 మంది సీఆర్పీలు, 70 మంది ఐఈఆర్పీలు బడీడు చిన్నారులను గుర్తిస్తున్నారు. జిల్లాలో దాదాపుగా 300 పైగా బడీడు పిల్లలు బయట ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు అంచనా వేశారు. వీరికి సమీపంలోని పాఠశాలల్లో అడ్మిషన్లు ఇస్తున్నారు. వీరితో పాటుగా జిల్లాకు చెంది మధ్యలో విద్యాభ్యాసం మానేసిన బాలకార్మికులను గుర్తించి, పాఠశాలల్లో చేర్పిస్తున్నారు.

చదువుకు దూరం కావొద్దు



బడీడు చిన్నారులు పాఠశాలల్లో విద్యను అభ్యసించాలి. కొన్ని ప్రత్యేక కారణాలతో చిన్నారులు తల్లిదండ్రులు పని చేసే ప్రదేశాల్లో ఉంటు, చదువులకు దూరం అవుతున్నారు. ఇలాంటి చిన్నారులను గుర్తించేందుకు బడీడు పిల్లల గుర్తింపు సర్వే నిర్వహిస్తున్నాం. గుర్తించిన చిన్నారులకు సమీపంలోని పాఠశాలలో విద్యను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఎవరూ చదువుకు దూరం కావొద్దు.

–శ్రీనివాస్‌రెడ్డి,
జిల్లా విద్యాశాఖ అధికారి

గుండెపోటు కలవరపాటు

- చిన్నా, పెద్దా తేడా లేకుండా బారిన
- ఒత్తిడి, ఆందోళనతో సమస్యలు అధికం
- ప్రజల్లో మారుతున్న జీవనశైలి
- ఆహార నియమాలు, వ్యాయామంపై నిర్లక్ష్యం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు




గుండె మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం. ఇది శరీరంలో ఛాతీ, ఊపిరితిత్తుల మధ్య ఉంటుంది. గుండె ఆక్సిజన్, పోషకాలని రక్తం ద్వారా శరీరంలోని అన్ని భాగాలకి సరఫరా చేస్తుంది. అయితే మారిన జీవనశైలి, ఆహార అలవాట్ల వల్ల ప్రస్తుతం వయస్సు, లింగ భేదంతో సంబంధం లేకుండా చాలా మందిలో గుండె సంబంధిత సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ ఆరోగ్యంగా ఉన్న యువతలో కూడా అకస్మాత్తుగా గుండెపోటు రావడం ఇప్పుడు ఆందోళన కలిగిస్తున్న విషయం. ఇప్పుడున్న పరిస్థితుల్లో గుండెపోటు మన దరి చేరకుండా ఉండాలంటే పలు రకాల జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

– సంగారెడ్డి టౌన్

జిల్లాలో గుండెపోటు కేసులు కలవరపరుస్తున్నాయి. 50 ఏళ్లలోపు గుండెపోటుకు గురవుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్న తీరు విస్మయపరుస్తోంది. ఓ వైపు టెక్నాలజీ పెరుగుతోంది.. వైద్యరంగం కొత్త పుంతలు తొక్కుతోంది. మరోవైపు.. మనిషి ఆరోగ్యం మాత్రం అపసవ్య దిశలో పరుగెడుతోంది. ఒకప్పుడు 60 పైబడిన వారిలో మాత్రమే గుండె సమస్యలు కనిపించేవి. నేడు 40 ఏళ్లలోపు వారినీ గుండెపోటు మింగేస్తోంది. గుండెకు శత్రువులు.. రక్తపోటు, మధుమేహం. కానీ, ఇటీవలి కాలంలో ఈ రెండు సమస్యలూ లేకపోయినా చాలామంది గుండెపోటు బారినపడుతున్నారు. దీనికి ప్రధాన కారణం మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లోపించడం, వ్యాయామం లేకపోవడం అంటున్నారు నిపుణులు.

ఆహారపు అలవాట్లు..

రోజూ తినే ఆహారపు అలవాటు భయాందోళనకు గురిచేస్తోంది. జీవనశైలిలో వస్తున్న మార్పులు, వ్యాయామం లేకపోవడం వంటి ప్రధాన కారణాలతో వస్తున్న గుండె జబ్బులు కుటుంబాలను విషాదంలోకి నెడుతున్నాయి. ఏటా ఐదు వేల నుంచి ఆరు వేల మంది వరకు గుండెపోటుకు గురవుతున్నారు.



వ్యాయామం చేయకపోవడం..

యువకుల్లో పూర్తిగా నడక తగ్గిపోయింది. కిలోమీటర్ వెళ్లాలన్నా బైక్‌లపై వెళ్తున్నారు. ఇష్టారాజ్యంగా కొవ్వుతో కూడిన ఆహారం తినడం, వ్యాయామం చేయకపోవడం వల్ల 30 ఏళ్లకే హార్ట్ స్ట్రోక్ వస్తోంది. శరీరానికి వ్యాయామం మినహా గుండెపోటు నియంత్రణకు మరో మార్గం ఏమీ లేదు. ఆల్కహాల్, సిగరెట్లు అలవాటు ఉంటే మానేయాలి.

గుండెపోటుకు ప్రధాన కారణాలు

- రక్తపోటు నియంత్రణలో లేకపోవడం.. రక్తపోటు ఉందని తెలుసుకోలేకపోవడం.
- కొవ్వు పేరుకుపోయి గుండెకు వెళ్లే రక్తనాళాలను పూడ్చివేయడం
- ఒబిసిటీ అంటే వయస్సు, ఎత్తుకు తగిన దానికంటే బరువు ఎక్కువగా ఉండడం.
- ఎక్కువ నూనెలు, కొవ్వులతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం.
- తీవ్ర మానసిక ఒత్తిడి, ఆందోళనకు గురికావడం
- ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించకపోవడం, నిత్యం వ్యాయామం చేయకపోవడం.

జాగ్రత్తలు ఇలా..

- రోజూ క్రమం తప్పకుండా 45 నిమిషాలు వ్యాయామం చేయాలి.
- 35 ఏళ్లు వచ్చాక మధుమేహం, బీపీ వంటి పరీక్షలు తరచూ చేయించడం.
- ఆరుమాసాలకు ఒకసారి విధిగా ఈసీజీ పరీక్షలు చేయించుకోవాలి.
- ఆకుకూరలు, కూరగాయలతో కూడిన ఆహారం తీసుకోవాలి.
- షుగర్, బీపీ ఉన్న వాళ్లు మందులతో వాటిని అదుపులో ఉంచుకోవడం
- శరీరంలో కొవ్వు, నూనె మోతాదుకు మించి ఉంటే అదుపులో ఉంచుకోవాలి.

ఒత్తిడితో సమస్యలు..



కొందరు ఉద్యోగ పరంగా లేదా వైవాహిక పరంగా విపరీత ఒత్తిడికి లోనవుతున్నారు. కొవ్వు సాధారణ స్థాయిలో ఉండి, సన్నగా ఉన్నవారికి కూడా ఒత్తిడితో గుండెపోటు వస్తోంది. పరస్పర అంగీకారంతో కుటుంబాల్లో సమస్యలను పరిష్కరించుకొవాలి. ఒత్తిడి తగ్గించుకొని గుండెపోటును దూరం చేసుకోవచ్చు. బయట ఆహారాన్ని తగ్గించాలి.

– డాక్టర్ మహేశ్, వైద్య నిపుణుడు

సైబర్ నేరగాళ్ల వలలో మహిళలు

- ఇద్దరి నుంచి రూ.2.22 లక్షలు వసూలు
- మోసపోవడంతో పోలీసులను ఆశ్రయం

పటాన్‌చెరుటౌన్: సైబర్ వలలో ఓ యువతి రూ. 1.92 లక్షలు, గృహిణి రూ.30 వేలు పోగొట్టుకున్న ఘటనలు అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడకు చెందిన ఓ యువతికి నవంబర్ 11వ తేదీన పార్ట్ టైం జాబ్ అంటూ మెసేజ్ వచ్చింది. బాధితురాలు తన వివరాలను నమోదు చేసి పలు దఫాలుగా రూ.1.92 లక్షలు పంపించింది. తీరా పెట్టిన నగదుపాటు కమీషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. బాధితురాలు తాను మోసపోయినట్టు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్‌లో, మంగళవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

గృహిణి వద్ద రూ.30వేలు

అమీన్‌పూర్ పరిధిలోని ఓడీఎఫ్ కాలనీకి చెందిన ఓ గృహిణికి వర్క్ ఫ్రం హోం జాబ్ ఉందంటూ నవంబర్ 24వ తేదీన ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. ఆమె అపరిచిత వ్యక్తి చెప్పినట్లుగా వివరాలు నమోదు చేసి రూ.30వేలు పెట్టుబడి పెడితే కమీషన్ వస్తుందని చెప్పడంతో అలానే చేసింది. కొద్దిరోజులకు నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడిగితే అతడు స్పందించలేదు. దీంతో బాధితురాలు తాను మోసపోయినట్లు అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.